క్లుప్తంగా

విశేషాలంకరణలో కనకదుర్గమ్మ



కొయ్యలగూడెం: ఆషాఢ మాసం పురస్కరించుకుని శనివారం స్థానిక వై జంక్షన్‌లోని కనకదుర్గమ్మ ఆలయంలో అర్చకుడు లక్ష్మణ శర్మ అమ్మవారిని వేప ఆకులతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. బయ్యనగూడెం, గవరవరం, కన్నాపురం, రాజవరంలలో గ్రామ దేవతలు, కనకదుర్గమ్మ ఆలయాల వద్ద ఆషాఢ మాస ఆశ్లేష నక్షత్ర తిథిని పురస్కరించుకుని పూజలు నిర్వహించి ఆధ్యాత్మిక కార్యక్రమాలు అమలు చేశారు. కొయ్యలగూడెం గ్రామ దేవత శ్రీ చింతాలమ్మ అమ్మవారి ఆలయం వద్ద నిర్వహిస్తున్న లలితా సహస్ర నామ కోటి పారాయణ 30 లక్షలకి చేరుకుంది. అరవై మందికి పైగా మహిళలు పారాయణ కార్యక్రమాల్లో పాల్గొనగా సాయంత్రం నుంచి ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు.

ఆలయ నిర్మాణానికి విరాళాలు



సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయానికి విరాళం అందజేస్తున్న దాతలు

కొయ్యలగూడెం: శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి పలువురు విరాళాలు అందజేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ తాడికొండ మురళీకృష్ణ శనివారం తెలిపారు. ప్రకాశం విద్యాసంస్థల అధినేత వి.జనార్ధన్ రూ. 50 వేలు, ఉపాధ్యాయురాలు వెజ్జు రాధికా రత్నశ్రీ రూ. 20వేలు, కన్నాపురంనకు చెందిన అల్లూరి రాంబాబు రూ.10 వేలు, ఇంకా విరాళాల రూపంలో మరో రూ.7వేలు దాతలు అందించారన్నారు. ఇటీవల వరకు ఉన్న ఆలయానికి వెనుక ఉన్న స్థలంలోనే రూ. 35 లక్షల అంచనాతో నూతన ఆలయ నిర్మాణాన్ని చేపట్టినట్లు తెలిపారు

ఉప్పల హారికకు బీసీ సెల్ నేతల మద్దతు



హారిక దంపతులను కలిసిన బీసీ సెల్ రాష్ట్ర నాయకులు

జంగారెడ్డిగూడెం: ఉమ్మడి కృష్ణా జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక దంపతులను రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి గురజాల పార్థసారథి యాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి తమ మద్దతు తెలిపారు. టీడీపీ గూండాల దాడిని ఖండిస్తూ, ఉప్పల హారిక వెంట తామంతా ఉంటామని స్పష్టం చేశారు.

కార్యకర్తలే పార్టీకి బలం



కార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

బుట్టాయగూడెం: వైఎస్సార్ సీపీకి కార్యకర్తలే బలమని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. కేఆర్ పురంలో శనివారం సాయంత్రం కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల్లో చంద్రబాబు ఓట్ల కోసమే అమలు కాని హామీలను ఇచ్చి అధికారంలోకి రాగానే వాటిని అమలు చేయకుండా ప్రజలను నట్టింట ముంచారన్నారు. చంద్రబాబు విధానాలను తిప్పికొట్టేందుకు ప్రతి కార్యకర్త ప్రతి గ్రామంలో పర్యటించి కూటమి ప్రభుత్వ తీరును వివరించాలన్నారు. సర్పంచ్ ఉయికే బొజ్జి, నాయకులు కాకి బ్రహ్మదేవుడు, కె. రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సంతాప సభ

జంగారెడ్డిగూడెం: స్థానిక కాసర నర్సిరెడ్డి కల్చరల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం సినీ కళాకారులు బి.సరోజా దేవి, కోట శ్రీనివాసరావుల సంతాప సభ నిర్వహించి వారికి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా వారు ఎన్నో వైవిధ్య పాత్రలను పోషించి కళారంగానికి అందించిన సేవలను కొనియాడారు. కాసర నర్సిరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో దారం సత్యనారాయణ, కాసర వెంకటరెడ్డి, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

80 మందికి కంటి పరీక్షలు

జంగారెడ్డిగూడెం: స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. రాజమండ్రి అకీరా ఆసుపత్రి వైద్యుడు ఎ.రమేష్ వైద్య పరీక్షలు నిర్వహించి శస్త్రచికిత్సలు అవసరమైన వారిని రాజమండ్రి అకీరా ఆసుపత్రికి సిఫార్సు చేశారు. మొత్తం 80మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.రాధాకృష్ణమూర్తి తెలిపారు.

మోసానికి అంబాసిడర్ చంద్రబాబు

- ఎన్నికల హామీలను గాలికొదిలేసిన చంద్రబాబు
- మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు విమర్శ

పోలవరం రూరల్: కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ప్రజలకు చేసిందేమి లేదని, మోసాలు, అబద్ధాలతో చంద్రబాబు సీఎం అయ్యారని పోలవరం మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు విమర్శించారు. పోలవరం గ్రామంలో శనివారం పార్టీ మండల కన్వీనర్ బుగ్గా మురళీకృష్ణ అధ్యక్షతన బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లం బాలరాజు మాట్లాడుతూ చంద్రబాబు మోసాలపై ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపైనే ఉందన్నారు. సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలకు మాయ మాటలు చెప్పి గద్దెనెక్కిన చంద్రబాబు ఏడాది కాలంలో ఎన్ని హామీలు అమలు చేశారని ప్రశ్నించారు.

హామీలతో మోసం

మొదటి నుంచి మోసాలతోనే ముఖ్యమంత్రి పదవులు చేపట్టారని, మోసానికి అంబాసిడర్ చంద్రబాబు అని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు మండిపడ్డారు. సూపర్ సిక్స్ పథకాలతో 2024లో ప్రజలను మోసం చేసి సీఎం అయ్యారన్నారు. రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపైనా, సోషల్ మీడియా ప్రతినిధులపైనా కేసులు పెట్టడమే కూటమి ప్రభుత్వానికి సరిపోతుందని, దీంతో అత్యాచారాలు, దాడులు పెరిగిపోయి ఏపీలో శాంతిభద్రతలు క్షీణించాయన్నారు. ఆ పార్టీ దత్త పుత్రుడు సైతం అనేక కబుర్లు చెప్పి ప్రజలను మోసం చేశారని పేర్కొన్నారు. అన్నదాత సుఖీభవ పేరుతో రైతులను, నిరుద్యోగ భృతి పేరుతో నిరుద్యోగులను, ఉచిత బస్సు పేరుతో మహిళలను మోసం చేశారని ఆరోపించారు. వలంటీర్లను సైతం దారుణంగా మోసం చేశారని, రూ. 10 వేలు గౌరవవేతనం ఇస్తామని చెప్పి కనీసం ఉపాధి లేకుండా తొలగించారన్నారు. ప్రభుత్వ ఆరోగ్య రంగాన్ని కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. మండల స్థాయి నాయకుల నుంచి గ్రామ స్థాయి నాయకుల వరకు చంద్రబాబు చేసిన మోసాలపై గ్రామాల్లో ప్రజలకు తెలియజేయాలన్నారు. వచ్చేది మళ్లీ మన ప్రభుత్వమే అని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమని బాలరాజు ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, జెడ్పీటీసీ కలుం హేమకుమారి, ఎంపీటీసీలు వలవల వరలక్ష్మి, యామల శ్రీదేవి, మిడియం సింగరాజు, కొత్త పట్టిసీమ సర్పంచ్ మైగాపుల విజయదుర్గ, ఎస్‌కే చాన్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పోలవరంలో ప్రభుత్వం చేస్తున్న మోసాలను తెలియజేస్తున్న మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు



వీరిశెట్టిగూడెంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మహిళలకు, దళితులకు రక్షణ లేదు

కామవరపుకోట: కూటమి ప్రభుత్వంలో దళితులకు, మహిళలపై దాడులు ఎక్కువయ్యాయని వారికి రక్షణ లేదని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రాయంకుల సత్యనారాయణ అన్నారు. శనివారం వీరిశెట్టిగూడెం గ్రామంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ వైఎస్ జగన్ తొలి సంతకంతో సంక్షేమ పథకాలు అమలు చేస్తే, చంద్రబాబు తొలి సంతకానికి విలువ లేకుండా చేశారని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న వైఎస్సార్ సీపీ కార్యకర్తలు నాయకులపై కేసులు నమోదు చేస్తూ డైవర్ట్ పాలిటిక్స్‌కి శ్రీకారం చుట్టారని అన్నారు. బలహీన వర్గాల ప్రతినిధిగా ఉన్న జెడ్పీ చైర్‌పర్సన్ హారికపై గుడివాడలో టీడీపీ గుండాలు చేసిన దాడి యావత్తు మహిళాలోకంపై జరిగిన దాడిగా అభివర్ణించారు. ప్రతి కార్యకర్త ప్రతి గడపకు వెళ్లి ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీలు గుర్తు చేస్తూ వారు చేసిన మోసాన్ని తెలియజేసి ప్రజలను చైతన్య పరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దేవరపల్లి రామ్మోహనరావు, ఎంపీటీసీ బొప్పన చైతన్య కుమార్, గ్రామ పార్టీ ప్రెసిడెంట్ పీతని గణపతి, వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

లచ్చిగూడెంలో చిరుత కలకలం!

కుక్కునూరు: మండలంలోని లచ్చిగూడెం గ్రామ సమీపంలో చిరుత పులి కనిపించిందనే సమాచారంతో అటవీ శాఖాధికారులు పరుగులు పెట్టారు. కుక్కునూరు ఫారెస్ట్ రేంజర్ కృష్ణకుమారి సిబ్బందితో వెళ్లి గాలింపు చేపట్టారు. ఎక్కడైతే పులి కనపడినట్టు చెప్పారో ఆ ప్రాంతంలో పాదముద్రల గురించి ఆరా తీశారు. గ్రామస్తులతో మాట్లాడిన అనంతరం పులి తిరిగిన మాట అవాస్తమని నిర్ణయానికి వచ్చారు. కాగా ఈ విషయమై రేంజర్‌ను వివరణ కోరగా చిరుతపులి కనపడిందన్న సమాచారం మేరకు వెంటనే ఆ ప్రాంతానికి వెళ్లి ఆధారాల కోసం వెతికినట్టు చెప్పారు. ఎటువంటి ఆధారాలు లభ్యం కాలేదన్నారు. ఇది పూర్తిగా అవాస్తమన్నారు.

గిరిజనుడిపై హత్యాయత్నం

వేలేరుపాడు: పోడు భూమి వివాదం చివరకు ఓ గొత్తికోయ తెగకు చెందిన యువకుడిపై హత్యాయత్నానికి దారితీసింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తెల్లిపల్లి గ్రామానికి చెందిన దిరడం చిర్మయ్యకు, ఇదే గ్రామానికి చెందిన మడకం దేవరాజు, సోడే జోగయ్యలకు పోడు భూమి వ్యవహారంలో గత కొంతకాలంగా వివాదం సాగుతోంది. ఈ విషయమై గతంలో గ్రామ పెద్దలు పంచాయితీ కూడా నిర్వహించారు. అయినప్పటికీ కక్ష పెట్టుకున్న మడకం దేవరాజు, సోడే జోగయ్య శనివారం కర్రలతో తలపై దాడి చేయడంతో చిర్మయ్యకు తీవ్రగాయాలై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. వైద్యం నిమిత్తం జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి అనంతరం విజయవాడకు తరలించారు. వేలేరుపాడు ఎస్సై నవీన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడుదాం

వేలేరుపాడు: ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటాలు కొనసాగిద్దామని సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మండలంలోని ఉదయ నగర్ లో పిట్టా ప్రసాద్ అధ్యక్షతన మండల కౌన్సిల్ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లతో ప్రభుత్వం చేస్తున్న మోసాన్ని ఆపాలన్నారు. అనంతరం జిల్లా సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆగస్టు 23, 24, 25 తేదీల్లో ఒంగోలులో జరిగే రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎండీ మునీర్, ఏపీజీఎస్ రాష్ట్ర అధ్యక్షులు కారం దారయ్య, వేలేరుపాడు, చింతలపూడి మండల కార్యదర్శులు బాడిశ రాము, తొర్లపాటి బాబు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ శ్రీనివాసపురం నూతన కమిటీ ఎన్నిక

జంగారెడ్డిగూడెం: వైఎస్సార్ సీపీ శ్రీనివాసపురం గ్రామ నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడు ఓరుగంటి నాగేంద్ర అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడిగా పోల్నాటి శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శులుగా పోల్నాటి వరప్రసాద్, చల్లగాలి ఈశ్వర్‌రావు, సిర్రారాజేష్, వసంతాటి శివాజీ, కార్యదర్శులుగా ఎలికే సత్యనారాయణ, టొక్కెం రమేష్, జుజ్జవరపు శ్రీను, తానిగడప రాజశేఖర్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఓరుగంటి నాగేంద్ర మాట్లాడుతూ నూతన కార్యవర్గం పార్టీ అభివృద్ధి కృషిచేయాలన్నారు. అలాగే కూటమి వైఫల్యాలను ప్రజలకు చేరవేయడానికి క్షేత్రస్థాయిలో నిరంతరం పనిచేయాలన్నారు. మాజీ జెడ్పీటీసీ ముప్పిడి శ్రీను, పల్లా గంగాధర్, కనకల్ల ప్రసాద్, ఓరుగంటి రామారావు, కుర్రు రవి, పోల్నాటి ప్రభాకర్‌రావు, పోల్నాటి చెల్లరావు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పార్టీ గ్రామ నూతన కమిటీ నిర్వహిస్తున్న దృశ్యం

వైఎస్సార్ సీపీ నేతల పరామర్శ

లింగపాలెం: వైఎస్సార్ సీపీ లింగపాలెం మండల మాజీ అధ్యక్షుడు కొఠారి మోహన్‌రావు సోదరుడు, పార్టీ నేత కొఠారి రఘుబాబు (57) గుండెపోటుకు గురై విజయవాడలోని మణిపాల్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. స్వగ్రామమైన తోచలక రాయుడుపాలెం నివాసానికి ఆయన భౌతికకాయం తీసుకురాగా వైఎస్సార్ సీపీ సందర్శించి నివాళులర్పించారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంభం విజయరాజు, లింగపాలెం మండల అధ్యక్షుడు అన్నపనేని శాంతారావు, వైస్ ఎంపీపీ మట్ట సురేష్, పార్టీ నాయకులు రావి కొండయ్య, ముసునూరు వెంకటేశ్వరరావు, సొంగ సందీప్, కలరాయనగూడెం సర్పంచ్ చల్లగొల్ల రవి బాబు, చింతలపూడి ఎమ్మెల్యే సొంగ రోషన్‌కుమార్, లింగపాలెం మండల టీడీపీ అధ్యక్షుడు గరిమల చలపతిరావు, పార్టీలకు అతీతంగా పెద్ద ఎత్తున నాయకులు కార్యకర్తలు అభిమానులు తరలి వచ్చి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొఠారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని, తెలియజేసి సంతాపాన్ని వ్యక్తం చేశారు.



రఘుబాబు భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న విజయరాజు, పార్టీ నేతలు

స్మార్ట్ మీటర్లను పగలగొట్టండి

కుక్కునూరు: కూటమి ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల మాటున దగా చేస్తుందని సీపీఐ జిల్లా కార్యదర్శి, సహాయ కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, బండి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో మండల కార్యవర్గ సభ్యుడు సోమరాజు అధ్యక్షతన మండల కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కృష్ణచైతన్య, వెంకటేశ్వర్లు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు బిగించడాన్ని తక్షణమే ఆపకపోతే మరో బషీర్‌బాగ్ ఉద్యమానికి ప్రజలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. విద్యుత్ సిబ్బంది ఇళ్లకు వచ్చి స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగలగొట్టాలన్నారు. స్మార్ట్ మీటర్ల విధానాన్ని రద్దు చేస్తామని ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చిన కూటమి పార్టీలు ప్రభుత్వం ఏర్పడ్డాక మోసగించాయన్నారు. స్మార్ట్ మీటర్ల బిగింపుతో ప్రజలపై భారం మోపడాన్ని వ్యతిరేకిస్తూ ఆగస్టులో విద్యుత్ కార్యాలయాల ముట్టడి చేస్తున్నట్టు చెప్పారు. ఈ సమావేశంలో డివిజన్ కార్యదర్శి కారం దాచరయ్య, ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు వరకా శ్యామల, జిల్లా కార్యవర్గ సభ్యులు, గిరిజనసంఘం నాయకులు పాల్గొన్నారు.



మండల కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

జంగారెడ్డిగూడెం డీఎస్పీ యు రవిచంద్ర

చింతలపూడి: నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జంగారెడ్డిగూడెం డీఎస్పీ యు రవిచంద్ర హెచ్చరించారు. స్థానిక పోలీస్ సర్కిల్ కార్యాలయంలో శనివారం స్కూల్ బస్సు డ్రైవర్‌లు, బస్సు యజమానులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీఎస్పీ రవిచంద్ర మాట్లాడుతూ స్కూల్ బస్సులు నడిపే డ్రైవర్లకు తప్పనిసరిగా హెవీ లైసెన్స్ ఉండాలన్నారు. బస్సుల్లో సీసీ కెమెరాలు అమర్చుకోవాలని చెప్పారు. ప్రతిరోజు వాహన కండిషన్‌ను పరిశీలించాలని, మద్యం సేవించి వాహనం నడపరాదని హెచ్చరించారు. విద్యార్థుల పట్ల అసభ్య పదజాలంతో మాట్లాడటం, ముట్టుకోవడం చేయరాదన్నారు. డ్రైవర్లు ఖాకీ బట్టలు ధరించడంతో పాటు ఐడీ కార్డు కలిగి ఉండాలని, వాహనానికి నెంబర్ ప్లేట్ తప్పనిసరిగా ఉండాలని, పిల్లలు బస్సు దిగిన పుడు వారు ఎటు వైపు వెళ్తున్నారో క్లీనర్ గమనించాలని సీఐ క్రాంతికుమార్ ఆదేశించారు. సమావేశంలో ఎస్సై సతీష్ కుమార్ పాల్గొన్నారు.



అవగాహనా కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎస్పీ యు రవిచంద్ర

ప్లాస్టిక్ నిషేధానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

బుట్టాయగూడెం: భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన నేలను, ప్రకృతిని అందించాలంటే ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించాల్సిన అవసరం ఉందని ఐటీడీఏ పీఓ కె.రాములు నాయక్ అన్నారు. కేఆర్‌పురం ఐటీడీఏలో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఓ కార్యాలయ పరిసరాలను స్వయంగా పరిశుభ్రం చేశారు. అనంతరం మాట్లాడుతూ గ్రామాల్లో సైతం ప్లాస్టిక్ వినియోగం పెరిగిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిని నియంత్రించవలసిన బాధ్యత ప్రతీఒక్కరిపై ఉందన్నారు. ప్లాస్టిక్‌కు బదులుగా ప్రతి ఒక్కరూ నార సంచులను వినియోగించుకోవాలని కోరారు. అలాగే అధికారులతో ప్లాస్టిక్ నిషేదంపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. బుట్టాయగూడెంలో కూడా ప్లాస్టిక్ నిషేదంపై ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీఓ కె.జ్యోతి, తహసీల్దార్ పీవీ చలపతిరావు, ఇతర అధికారులు ప్రతి షాపునకు తిరిగి ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలన్నారు.

పారిశుధ్యంపై అవగాహన ర్యాలీ

జంగారెడ్డిగూడెం: ప్లాస్టిక్ నిరోధించి భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించే బాధ్యత మనందరిపై ఉందని మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి అన్నారు. జంగారెడ్డిగూడెం మునిసిపల్ ఆధ్వర్యంలో శనివారం స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివాస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం నుంచి బోసుబొమ్మ సర్కిల్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి మాట్లాడుతూ ప్లాస్టిక్ కి బదులుగా జ్యూట్, పేపర్, గ్లాస్ వస్తువులు వినియోగించాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ కేవీ రమణ, ఏఈ రాజేష్, కౌన్సిలర్‌లు, నాయకులు, మున్సిపల్, సచివాలయ, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు. అలాగే జంగారెడ్డిగూడెం ఛత్రపతి శివాజీ త్రి శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, స్థానిక ఏరియా ఆసుపత్రిలో శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు.



కేఆర్‌పురం వద్ద ప్లాస్టిక్ నిషేదంపై ప్రతిజ్ఞ చేయిస్తున్న పీఓ రాములు నాయక్

పోలవరంలో...

పోలవరం రూరల్: ప్లాస్టిక్ వాడకాన్ని నిషేదించాలని ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాసబాబు పిలుపునిచ్చారు. పోలవరం గ్రామంలో స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివాస్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రధానంగా రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ చెత్తవేసి పారిశుధ్యానికి ఇబ్బంది కలిగించకుండా ప్రజలు సహకరించాలన్నారు. ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, తహసీల్దార్ ఆర్.సాయిరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గంగాధర్, అంగన్‌వాడీ, ఆశ, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

కొయ్యలగూడెంలో...

కొయ్యలగూడెం: దిప్పకాయలపాడులో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. సర్పంచ్ సున్నం శాంత కుమారి ఆధ్వర్యంలో ఎంపీయూపీ స్కూల్ విద్యార్థులు ర్యాలీ చేశారు.



జంగారెడ్డిగూడెం మున్సిపల్ కార్యాలయం వద్ద ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

గ్రామంలోని మెయిన్ రోడ్‌లో ఉన్న షాపుల వద్దకు వెళ్లి ప్లాస్టిక్ కవర్లు విక్రయించవద్దు అంటూ అభ్యర్థించారు. ఎంపీడీవో కె.కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో పరింపూడి తో సహా పలు పంచాయతీల్లో స్వచ్ఛభారత్ కార్యక్రమాలు నిర్వహించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

చింతలపూడి: పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ పిలుపునిచ్చారు. నగర పంచాయతీ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిషేధంపై శనివారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని కోరారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో...

స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. భావితరాల భవిష్యత్ కోసం ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ భూతాన్ని అంతమొందించేందుకు కృషి చేయాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి శ్రీనివాసరావు కోరారు. వైస్ ప్రిన్సిపాల్ ఎస్‌జేకే నరేంద్ర కుమార్, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో వసతులు కరువు



చల్లవారిగూడెం ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో చమ్మగిల్లుతున్న ఇల్లు



తుప్పలతో నిండిన మరుగుదొడ్ల నూతులు



అధ్వానంగా ఉన్న రహదారి



చల్లవారిగూడెం ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇళ్ల మధ్య తుప్పలు పెరిగిపోయిన దృశ్యం

సమస్యలతో అల్లాడుతున్న 80 కుటుంబాలు

జంగారెడ్డిగూడెం: కనీస వసతులు లేక ఆర్‌అండ్‌ఆర్ కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల గోదావరి వరదల నేపథ్యంలో మండలంలోని చల్లవారిగూడెం పంచాయతీ పరిధిలో ఉన్న ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి వేలేరుపాడు మండలం రాపాకగొమ్ము నుంచి 80 కుటుంబాలను అధికారులు తరలించారు. అయితే ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో సరైన సదుపాయాలు లేకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీస అవసరాలైన మంచినీరు, ఇల్లు వంటివి సైతం సమస్యాత్మకంగా ఉన్నాయని వాపోతున్నారు.

తినడానికి తిండి లేదు.. తాగడానికి నీరు లేదు

ఈ సందర్భంగా ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ఉన్న సమస్యలపై వారు మాట్లాడుతూ తాము ఇక్కడ తరలివచ్చిన తర్వాత కనీసం రెండు నియోజకవర్గ ఎమ్మెల్యేలు కూడా ఎవరూ పట్టించుకోడం లేదన్నారు. ప్రభుత్వం నుంచి ఏ సహాయం కూడా తమకు అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి లేదని, తినడానికి తిండి లేదని, తాగడానికి మంచినీరు లేదని గగ్గోలు పెడుతున్నారు. కాలకృత్యాలు తీర్చుకోవడానికి కనీసం బాత్రూం కలెక్షన్లు కూడా లేని దుస్థితి ఉందని, ఇక్కడ తమకు కట్టిన ఇల్లు నాణ్యత లేకపోవడంతో వర్షం వస్తే తడిసిపోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అపరిశుభ్ర వాతావరణంతో, దోమలతో పోరాటం చేస్తున్నామని వాపోయారు. ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ఎన్నో భవనాలు పూర్తి కాక శిథిల వ్యవస్థకు చేరుకుంటున్నాయని, ముంపు ప్రాంత ప్రజలమైన తమను ఇక్కడకు తీసుకొచ్చారని, కనీసం ప్రభుత్వం నుంచి నిత్యవసర సరుకులు కూడా అందజేయలేదని పేర్కొంటున్నారు. తాము కష్టపడి కూలి పని చేసుకునే వాళ్ళమని, తాము ప్రశ్నిస్తే అధికారులు వచ్చి దురుసుగా మాట్లాడుతున్నారని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన సౌకర్యాలు కల్పించి సమస్యలు తీర్చాలని వేడుకుంటున్నారు.

సౌకర్యాలు లేవు



వేలేరుపాడు మండలం రేపాక గొమ్ముకు ఇటీవల గోదావరి వరద రావడంతో రెవెన్యూ అధికారులు చల్లవారిగూడెం నిర్వాసిత కాలనీకి తరలించారు. ఇక్కడ కరెంటు లేదు, మంచినీళ్లు లేవు, పిల్లలకు పాఠశాల లేదు. రోడ్డు సౌకర్యాలు లేవు. ఇళ్లు వర్షం వస్తే కారిపోతున్నాయి. చెత్తాచెదారాలు పేరుకుపోయాయి.

– గుమ్మల్ల నరసయ్య, ఆర్‌అండ్‌ఆర్ కాలనీ, చల్లవారిగూడెం

పది రోజులైనా ఉపాధి లేదు



మమ్మల్ని ఇక్కడకు తీసకువచ్చి 10 రోజులైంది. పనులు లేవు. ఉపాధి లేదు. బాత్రూమ్‌లు లేక మహిళలు ఇబ్బందులు పడుతున్నాం. పది రోజులు దాటినా ఏ సహాయం చేయలేదు. నీళ్ల కోసం ఇబ్బందులు పడుతున్నాం. వీధి లైట్లు లేవు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమను ఆదుకోవాలి.

– గుండారపు రజిని, ఆర్‌అండ్‌ఆర్ కాలనీ, చల్లవారిగూడెం

కె-9 నూతన కార్యవర్గం ఎంపిక

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని రావూరి జంక్షన్ వద్ద నిర్వహించిన కె-9 సమావేశంలో శనివారం నూతన సంఘం తొలి కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా తొమ్మిదేళ్ల శ్రీను, కార్యదర్శిగా శీలం కృష్ణంరాజు, కోశాధికారిగా పులఖండం మోహన్ ఎంపికయ్యారు. గౌరవ అధ్యక్షుడు దాకారపు కృష్ణ మాట్లాడుతూ సంఘం ద్వారా కాపు కులంలో ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు చేయూత, వ్యాపార రంగంలో సలహాలు, సూచనలు అందించడమే లక్ష్యంగా పనిచేయనున్నట్లు తెలిపారు. సంఘ గౌరవ సలహాదారు రావూరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.